(ఏడవ భాగము)

క్షణాల్లో బైటికి వచ్చాడు రైనా.

పెట్రోల్ స్క్వాడ్ కార్ లోకి మెరుపులా గెంతి, కార్ని విద్యుత్ వేగంతో జస్లోక్ ఆస్పత్రి వైపు పరిగెత్తించాడు రైనా, సైరన్ మ్రోగించుకుంటూ....

అయిష్టంగా ఒప్పుకున్నాడు రాణా—తిరిగి హెడ్ క్వార్టర్స్ కు రావడాన్కి. లూసీ ట్రీట్ మెంట్ విషయంలో—తనకు యింతకుముందు ట్రీట్ మెంట్ ఇచ్చిన కాంబే హాస్పిటల్ వైదుల్ని సంప్రదించవలసిందిగా రాణా జస్లోక్ వైద్యుల్ని కోరాడు.

ప్రధానవైద్యుడు అందుకు అంగీకరించాడు. కాని రాణాకు యింతకుముందు ఏర్పడిన ఉన్మాదం గురించి మరి కొన్ని వివరాలు అడిగాడు.

ఇన్ స్పెక్టర్ రైనా, అసహనంగా మధ్యలో అడ్డుకున్నాడు. మొత్తం వివరాలన్నీ రాణాకు ముందు ట్రీట్ మెంట్ తీసుకున్న కాంబే మిషనరీ హాస్పిటల్ నుండి పొందవలసిందనీ—ఇప్పుడు అర్జంటుగా తాము పోలీస్ హెడ్ క్వార్టర్ కి వెళ్ళాలనీ—అక్కడి సమస్య ఒక స్త్రీ క్షేమంకంటే తీవ్రమైన సమస్య అనీ—గబగబా చెప్పి, నివ్వెరబోతూ చూస్తున్న డాక్టర్ని వదిలిపెట్టి-రాణాను లాక్కుపోయాడు రైనా.

ట్రాఫిక్ ని అదరగొడుతూ తిరిగి హెడ్ క్వార్టర్స్ వైపు దూసుకుపోయింది పెట్రోల్ కార్.

పది నిమిషాల్లో రాణా, రైనా-మెహ్రోత్రా ఆఫీసులో ప్రత్యక్షమయ్యారు.

ఉపోద్ఘాతం లేకుండా సూటిగా ప్రారంభించాడు సూపరింటెండెంట్ మెహ్రోత్రా. "క్షమాపణలకి ఇప్పుడు

సమయంలేదు మిస్టర్ రాణా! ఉదయం లూసీ యింట్లో జరిగిన దుర్ఘటన గురించి రైనా ద్వారా తెల్సుకున్నాను. నీ మానసిక సంఘర్షణ నేనర్థం చేసుకోగలను. నీ పట్ల గుండెలనిండా సానుభూతి ఉంది కూడా. కానీ యింత కంటే ప్రాధాన్యతగల, దారుణమైన సంఘటనలు మరి కొన్ని జరిగాయ్."

పైపులోంచి గుప్పుగుప్పున పొగ వదులుతూ హడా వుడిగా చెప్పుకుపోయాడు మెహ్రోత్రా. "రాత్రి అంతా రిపోర్ట్సు ప్రవహిస్తూనే ఉన్నాయి కంట్రోల్ రూమ్‌కి, మరికొన్ని విచిత్ర సంఘటనల గురించి.... ఈ సందర్భంలో ఒక విషయం గుర్తు చెయ్యాలి. నేను చేసినవన్నీ అనధి కారమైన ఏర్పాట్లే. ఎందుకంటే నీ ఒక్కడి కంప్లెంట్ మీద, ఎంతో మందికి సంబంధించిన కేస్‌ని డీల్ చేయటం యిది. నా జాగ్రత్తలో నేనుండాలిగా...."

"నా ఒక్కడి కంప్లెయింట్ మీద యింత శ్రద్ధ తీసు కున్నందుకు థాంక్స్" అన్నాడు రాణా వ్యంగ్యంగా.

మెహ్రోత్రా యిబ్బందిగా తల దించి, గొంతు సర్దు కున్నాడు. మళ్ళీ అతని కంఠం అధికారయుతంగా పల్కింది. "వెల్! మొత్తానికి రిపోర్ట్సు మెల్లగా గుట్ట లయ్యాయి. నిముషాల్లో ఈ కేస్ నా ఒక్కడికే సంబం ధించింది కాకుండా, హెడ్‌క్వార్టర్స్‌లోని పోలీసు అధి కారులందరూ కలగజేసుకోవాల్సిన కేసుగా మారింది. మొదట్లో యిలాంటివే కొన్ని వ్యక్తిగత సంఘటనలు జరిగాయి.... తర్వాత చిల్లరమల్లర సంఘటనలు.... మళ్ళీ దారుణకృత్యాలు.... యివన్నీ బొంబాయికి తూర్పున ఉన్న భావ్‌నగర్, కాంబే ఊళ్ళనుండి ఉత్తరాన వున్న మాహిమ్ పట్టణానికి ప్రాకాయి....

"ఈ వార్త పోలీస్ కమిషనర్‌కు, ఆయన్నుంచి ఐ.జీ.కీ,....ఐ.జి. నుండి హోమ్ మినిస్టర్‌కీ, హోమ్ మినిస్టర్ నుండి ముఖ్యమంత్రికీ చకచకా పాకిపోయింది.

"తత్ఫలితంగా వెంటనే ఓ అత్యవసర సమావేశం ఏర్పాటు చేయబడింది. ఈ ఎమర్జన్సీ సమావేశాన్కి ఢిల్లీ నుంచి మంత్రులు, కార్యదర్శులు వెంటనే బయలుదేరి స్పెషల్ విమానంలో వస్తున్నారు....

"అకస్మాత్తుగా ఇది జాతీయ సమస్య ఎందుకయిందో యిప్పుడు చెప్తాను. రెండుగంటల క్రితం-మా కాళ్ళు గడ గడలాడించిన వార్త యిది....కాని యింకా పూర్తి వివరాలు అందలేదు....ఈ వార్త నమ్మరాని అసహజ వార్త! ప్రపంచ చరిత్రలో యింతటి దారుణ సం...."

"ఫర్ గాడ్ సేక్!" దాదాపు అరిచాడు రాణా.

"ఈ ఉదయం సుమారు ఆరుగంటలకి, బొంబాయికి ఉత్తరాన ఉన్న మాహిమ్ పట్టణంలోని దాదాపు మొత్తం జనాభా అంతా యిళ్ళు వాకిళ్ళు వదిలిపెట్టి సముద్రంలోకి నూకి మూకుమ్మడిగా ఆత్మహత్య చేసుకున్నారు."

గదిలో అకస్మాత్తుగా భయంకరమైన నిశ్శబ్దం అలుముకుంది....

కొంతసేపటికి రాణా నిద్రలో కలవరించినట్లుగా అన్నాడు.

"మైగాడ్....యిట్స్ ఇంపాసిబుల్...."

"ఇంపాసిబుల్. ఎస్! కాని ఈ మారణహోమం ప్రత్యక్షంగా జరిగింది, మిస్టర్!—ఒక లక్షా యాభైవేల ఎనిమిదివందల మంది ప్రజలు! యిది పోరుగూర్ల నుంచి పనుల మీదా, శెలవుల మీద, టూరిస్టులాగా, ఆ వూరు వచ్చిన జనాభా కాకుండా-చెప్పిన సంఖ్య..

స్త్రీలు, పురుషులు, పిల్లలు, పెద్దలు, ముసలీ, ముతకా అందరూ మునిగిపోయారు....

చోటు లేక, సముద్రంలోకి నడిచే దారిలేక, యిలతలగా కొట్టుమిట్టాడుతున్న కొంతమందిని మాత్రం రక్షించే ప్రయత్నాలు జరుగుతున్నాయి....

బొంబాయి హార్బరంతా శవాలతో నిండిపోయింది! సముద్రతీరం పొడుపునా మృతకళేబరాలు ముట్టడించి ఉన్నాయ్....

అంతవరకూ మౌనంగా వున్న ఇన్‌స్పెక్టర్ రైనా, టాపిక్ మారుస్తూ అన్నాడు.

"విషమేఘం విషయమేమిటి సర్? అది లొకేట్ చేయబడిందా?"

"లేదు. అది ప్రస్తుతం ఎక్కడ ప్రయాణిస్తోందో తెలియలేదు. పోలీసు బలగం అంతా అదే ప్రయత్నంలో వుంది. ఎనీవే, ప్రజల్లో యిప్పుడు ఉన్న ఆందోళన చాలు. విషమేఘమే దానికి కారణమని మనం పబ్లిసిటీ చేస్తే ఆ వార్త అట్టుడికిపోతుంది. ప్రజల దైనందిన జీవితం స్తంభిస్తుంది. అదిగో తోక అంటే ఇదిగో పులి అంటూ రకరకాల పుకార్లతో, నీలివార్తలతో రాష్ట్రం భీతావహమౌతుంది.

ఈ విషయాన్ని పబ్లిసిటీ యిచ్చేముందు నేను కమిషనర్ అనుమతి కోరాలి.

కాని ఒక్క విషయం నాకు రూఢిగా తెల్సింది.

నిన్నటిరోజు అంతా దట్టమైన పొగమంచుతో కప్పబడివుంది మాహిమ్ టౌన్."

• • •

మధ్యాహ్నం రెండు గంటలైంది.

మహారాష్ట్ర శాసనసభా భవనాన్కి కల్సివున్న ఛత్రపతి భవన్‌లోని కాన్ఫరెన్స్ హాల్లో అత్యవసర సమావేశం జరుగుతోంది.

ఢిల్లీనుంచి ప్రత్యేక విమానంలో వచ్చినవారిలో భారత హోమ్ సెక్రెటరీ, రక్షణశాఖ సహాయమంత్రీ, ఆర్మీ అండర్ సెక్రటరీ, వాతావరణ కాలుష్య పరిశోధనా శాఖ డైరెక్టర్ ఉన్నారు.

హోమ్ సెక్రటరీ—రాణా చెప్పే కథను మధ్య మధ్యలో సందర్భయుతమైన ప్రశ్నలు వేస్తూ, ఓపిగ్గా, ఆశ్చర్యంగా, శ్రద్ధగా ఆలకిస్తున్నాడు.

రౌండ్ టేబుల్ చుట్టూ రాష్ట్ర, కేంద్ర—అధికారులు కూర్చుని వుండగా, రాణా తన అనుభవాన్ని పూసగుచ్చినట్టు వివరిస్తున్నాడు, అప్పుడప్పుడు పిస్తోలు తూటాల్లా విరుచుకుపడుతున్న ప్రశ్నలకు ఓపిగ్గా సమాధానాలిస్తూ. రక్షణశాఖ సహాయమంత్రి—రాణా వ్యక్తిగత వ్యాఖ్యానాలకు కోపంతో విరుచుకుపడుతున్నాడు.

ఇరవై నిముషాల్లో అధికార్ల మధ్య—సమస్యకు పరిష్కారం దొరక్కపోగా—వాదోపవాదాలు చెలరేగి సమావేశం గందరగోళంగా మారింది.

హోమ్ సెక్రటరీ విసుగ్గా పిడికిలితో టేబులుమీద గుద్దాడు. "జంటిల్మెన్! సమస్య ఈ స్థాయిలో ఉండగా మనం వాదోపవాదాలు కొనసాగించడం ఎంత మాత్రం వాంఛనీయం కాదు. మిస్టర్ రణధావే! ఖుల్నా ఏరియాలో మీరు నెలకొల్పిన మిలటరీ ఏస్టాబ్లిష్‌మెంట్స్ మీద ఫుల్ రిపోర్టు నాకు కావాలి" ఆర్డర్ జారీ చేస్తూ అన్నాడు, ఆర్మీ అండర్ సెక్రటరీకి "అక్కడ మీరు

ఈ మధ్య చేసిన ప్రయోగాల పూర్తి వివరాలు నాకు కావాలి. ముఖ్యంగా ఆ....ఎక్స....ఎక్స్‌పెరిమెంట్"

ఆ వాక్యం అర్థాంతరంగా పూర్తవుతుండగా యిద్దరి మధ్యా సాగిన తత్తరపాటు చూపులు రహస్యంగా గమనించాడు రాణా.

"గోకుల్ రామ్‌జీ!" హోమ్ సెక్రెటరీ-రక్షణశాఖ సహాయమంత్రి వైపు తిరిగాడు. "భావ్‌నగర్, కాంబే, ట్రాంబే మొదలైన ప్రమాదాన్కి గురికాగల ఊళ్ళల్లో జనాన్ని ఖాళీ చేయించడాన్కి సైనికశక్తి అవసరం! కమిషనర్! మీ వాళ్ళు విషమేఘాన్ని లొకేట్ చేయగల్గారా?"

"నాట్ యెట్ సర్! విషమేఘం కన్పించిన మరుక్షణం హెడ్‌క్వార్టర్స్‌కి రిపోర్టు చేయమని పోలీస్ ఫోర్స్ కంతటికీ ఆదేశాలు ఇవ్వబడ్డాయ్."

"మెటీరియాలజీ ఆఫీస్‌ని వెంటనే కాంటాక్టు చేసి వారి సహాయంతో ఎయిర్ కరెంట్స్‌లో మార్పులు గమనిస్తూ వుండమని నా సలహా."

"విషమేఘం ఉనికి తెల్సుకోవడంలో వాళ్ళు యిప్పటికే మాతో కల్సి పని చేస్తున్నారు సర్!" చెప్పాడు వినయంగా కమిషనర్.

"తీరా మీకు ఆ విషమేఘం కనబడిన తర్వాత అది ఎటువైపు వెళ్తుందో తెల్సుకోవడం ఎలా? అంటారు. అవునా?" వ్యంగ్యంగా అన్నాడు హోమ్ సెక్రెటరీ.

"అసలు విషయం చర్చించలేదు. విషమేఘం కనబడిన తర్వాత, దాన్ని ఏమి చేద్దామనుకుంటున్నారు? అది గాలిలో తేలుతుంటే వెనకాల పరిగెడతారా?"

ఓ తెల్లగడ్డం వ్యక్తి కంఠం గంభీరంగా వినబడింది.

ఆయన ప్రొఫెసర్ సన్యాల్.

రాణాకు సంబంధించిన వ్యక్తి.

డిపార్టుమెంట్ ఆఫ్ ఎన్విరాన్‌మెంట్-డైరెక్టర్.

అంత సీరియస్ వాతావరణంలోను నవ్వులు వినబడ్డాయి.

"దేరార్.... మెథడ్స్ ప్రొఫెసర్ సన్యాల్!" రక్షణ శాఖ సహాయమంత్రి కోపంగా చూస్తూ అన్నాడు. "కొన్ని పద్ధతులు లేకపోలేదు.... పూర్వపు యుద్ధాల్లో బ్రిటిష్ వాళ్ళు అవలంబించిన పద్ధతులు కొన్ని ఉన్నాయి. కాని రాడార్ అభివృద్ధి చెందిన తర్వాత అవి పాతబడిపోయాయి. కాని ఆ పాతపద్ధతుల ద్వారా ఇంకా ఫలితాలు సాధించవచ్చు."

"మొట్టమొదట ఈ విషమేఘం ఉనికిని తెల్సుకోడం ముఖ్యం" అసహనంగా అన్నాడు హోమ్ సెక్రటరీ. "అది ఏ దిశగా పయనిస్తోందో నాకు తెలియాలి. తర్వాత ఆ దిక్కులో జనం లేకుండా చూడాలి."

"మిస్టర్ రాణా! కేంద్ర ఆరోగ్యశాఖకు సంబంధించిన మెడికల్ రీసెర్చి విభాగం యిదే నగరంలో వుంది. వారికి మీరు ఎప్పుడూ అందుబాటులో ఉండాలి. యునో, విషమేఘం ప్రభావం నుండి కోలుకుని బైటపడిన వారు ప్రస్తుతానికి మీరు ఒక్కరే.

మీరు యెలా కోలుకోగలిగారో నాకు తెలియాలి. అది తెల్సుకుంటే—మనం వేలాది ప్రాణాలను రక్షించవచ్చు."

"స్.... సర్! మాషేరా మైదాన్ వ్యక్తులు, మెడికల్ రీసెర్చి వాళ్ళతో కల్సి పనిచేస్తే ఉపయోగకరంగా వుంటుందని నా అభిప్రాయం" గొణిగాడు ఆర్మీ అండర్

సెక్రటరీ.

"షేరా మైదాన్?" కనుబొమలెగరేశాడు వాతావరణ కాలుష్య పరిశోధనా శాఖ డైరెక్టర్ సన్యాల్.

"ఎస్. మా డిపార్టుమెంట్ తాలూకు కెమికల్ రీసెర్చి అండ్ మైక్రోబయోలాజికలు రీసెర్చి ఎస్టాబ్లిష్ మెంట్స్ అక్కడ వున్నాయి."

"షేరా మైదాన్, ఖుల్నా ఏరియాలో ఉంది కదూ?" నొక్కి పలికాడు సన్యాల్, అనుమానంగా చూస్తూ.

"అవును."

"మొత్తం వ్యవహారమంతా నాకేదో గూడుపుఠాణిలా కన్పిస్తోంది." ఉద్రేకంగా అన్నాడు సన్యాల్ పైకిలేస్తూ "డిఫె"....

వాదప్రతివాదాలు ఆపమన్నట్టుగా, రెండు చేతులూ చాపాడు హోమ్ సెక్రటరీ. "జంటిల్మెన్! ఖుల్నా ఏరియాలో జరిగే ప్రయోగాల గురించి మొత్తం రిపోర్టు యివ్వమనవల్సిందిగా రణధావేని కోరాను. ఆ రిపోర్టు చదవకుండా, మనలో మనం కొట్లాడుకోడంవల్ల ఉపయోగంలేదు. ప్రస్తుతాన్కి మనం చెయ్యవల్సిన పనులు ఇంతకంటే ముఖ్యమైనవి ఉన్నాయ్.

ఇకపోతే మెడికల్ రీసెర్చ్—'మైక్రో బయోలజీ పరిశోధకుల్ని' ఉపయోగించుకోడాన్కి అభ్యంతరం లేదు.

ఈ ఉపద్రవాన్ని ఎదుర్కోడంలో, ఎంత చిన్న సహాయం ఎటువైపు నుంచి లభించినా దాన్ని పూర్తిగా మనం వినియోగించుకోవాలి. ఈజ్ ఇట్ అండర్ స్టుడ్?"

మరో నలభై నిముషాలదాకా వారు ఆ అసాధారణ పరిస్థితి నెదుర్కోడాన్కి ప్రణాళికలు వేస్తూ చర్చలు

జరిపారు.

ప్రజల్ని ప్రమాదస్థలాలనుంచి ఖాళీ చేయించడానికి ఏ విధమైన చర్యలు తీసుకోవాలో విషమేఘాన్ని ఎలా విడగొట్టాలో మొదలైన కీలకమైన విషయాలు చర్చించబడ్డాయి. వివిధ అధికారులకు కొత్తబాధ్యతలు అందించబడ్డాయి. అంతలో ఎవరో వచ్చి పోలీస్ కమిషనర్‌కి ఓ కాగితం ముక్క తెచ్చి యివ్వడంతో సమావేశ కార్యక్రమానికి భంగం ఏర్పడింది.

"జంటిల్మెన్! విషమేఘం ఉనికి తెలుసుకోబడింది" లేచి నిలబడి ఎనౌన్స్ చేసాడు కమిషనర్, విచారంగా "అది ఇప్పుడు బొంబాయి ఉత్తర దిశలో ప్రయాణిస్తోంది నాసిక్ వైపు...."

* * *

మాహిమ్ సముద్రపు దుర్ఘటన, దాదాపు దేశంలోని అన్ని వార్తాపత్రికల్లోనూ ప్రముఖంగా ప్రచురించబడింది.

వేలాది పత్రికా విలేఖరులకు చేతినిండా పని తగిలింది?

ఎడిటోరియల్ కాలమ్స్‌లో ప్రభుత్వ నిర్లక్ష్యవైఖరిని, ప్రభుత్వ యంత్రాంగ సోమరితనాన్ని దుయ్యబడ్డాయ్ అన్ని పత్రికలూ....

కొన్ని పత్రికలు—మాహింలో లక్షన్నర మంది ప్రజల అమాయకపు చావు సంఘటన వెనక ఏదో శత్రు దేశం హస్తముందనీ, అది ముందుగా గూఢచారిశాఖ ఎందుకు తెల్సుకోలేకపోయిందో సంజాయిషీ చెప్పాలనీ, డిమాండ్ చేశాయి.

పత్రికలవాళ్ళకి, చేతులకీ, కాళ్ళకీ, పని తగిలితే-పార్లమెంటులో ప్రతిపక్షానికి నోటినిండా పని తగిలింది.

ప్రభుత్వం తగిన చర్యలు తీసుకొనేలోగా, యింకా

ఎన్ని లక్షలమంది మరణించాలంటూ వారు కేకలు పెట్టారు.

అంతటా గందరగోళం ఆవిర్భవించింది.

ర ర ర

రాణా కాగ్లో జస్లోక్ హాస్పిటల్ కి వెళ్ళాడు లూసీని ఆలిండియా మెడికల్ రీసెర్చి భవనాన్కి తరలించడానికి.

వెంట ఎస్కార్ట్ గా మరో కార్లో రాణాను అనుసరించాడు డిటెక్టివ్ ఇన్స్పెక్టర్ రైనా.

భారత్ హోమ్ కార్యదర్శివల్ల రాణా ఇప్పుడు అధికారుల్లో విలువైన వ్యక్తిగా పరిగణింపబడుతున్నాడు.

విషమేఘం ప్రభావం నుండి కోలుకున్న వ్యక్తి ఒక్క రాణాయే కావడంవల్ల అతన్కి యెంతో ప్రాధాన్యత లభించింది.

ఏ విధంగా కోలుకోగలిగాడో తెల్సుకోడానికి— అతని ప్రస్తుత ఆరోగ్యం - మెదడు సరళి మొదలైన విషయాలపై అనేక పరీక్షలకు గురికాబోతున్నాడు ఆలిండియా మెడికల్ రీసెర్చి భవనంలో.

ప్రస్తుతం అందుబాటులో వుండడంవల్ల, విషమేఘం ప్రభావాన్కి గురి అవుతూ౦డడంవల్ల, లూసీ అవసరం కూడా ఏర్పడింది వారికి.

మెదడుకు ఏ విధమైన నష్టం వాటిల్లిందో పరిశోధించడాన్కి మాహిం నుండి కొందరి మృతదేహాలు హెలికాప్టర్లో బొంబాయికి తరలించే ఏర్పాట్లు చేయబడ్డాయి.

జీవించివుండీ, ఉన్మాదస్థితిలో వున్న మిగతా ప్రజల్లో కొందర్ని ఎన్నుకొని-పరీక్షలకోసం తరలించబోతున్నారు.

జస్లోక్ హాస్పిటల్ నుండి లూసీ, రాణాలు అంబు

లెన్స్‌లో వైద్యశాఖ ప్రత్యేక భవనానికి ప్రయాణిస్తున్నారు.

అంబులెన్స్‌లో కూర్చుని రాణా—మత్తుమందు ప్రభావంలో పడి నిద్రపోతున్న లూసీ రెండు చేతులు పట్టుకుని బెంగగా ఆమెకేసి చూస్తున్నాడు.

తెల్లగా పాలిపోయివున్న ఆమె ముఖం రాణాలో ఆందోళన రేకెత్తిస్తోంది.

వాచీ చూసుకున్నాడు రాణా.

9-45.

భగవాన్! తాను ఎంత అలసిపోయాడు.

తను అప్పుడే మధ్యాహ్నం అయిందనుకున్నాడు. బొంబే రోడ్లమీద ట్రాఫిక్ ఉధృతమౌతోంది.

జనం ఆఫీసులకి తరలుతున్నారు.

మాహిమ్ దుర్ఘటన విన్న ప్రజల్లో భయభ్రాంతులు చెల రేగాయి? మొత్తం లక్షన్నర జనాభా పొగమంచు సోకి ఉన్మాదస్థితిలో సముద్రగర్భంలో కలిసిపోయారు. దారుణ సంఘటన.

ప్రజలకు ఖచ్చితంగా సమాధానం చెప్పుకోవాల్సి వుంది ప్రభుత్వం.

తన ఉద్యోగ నిర్వహణలో—వాతావరణ కాలుష్యం మనిషి ఆరోగ్యానికి ఎంత ప్రమాదకరమో తెల్సుకున్నాడు.

కాని యింత సర్వనాశనం అది సృష్టించగలదా?

పత్రికలు బహుశా-ఏదైనా రసాయనంవల్ల గానీ ఎక్కడైనా సైంటిఫిక్ లాబరేటరీ వదిలిపెట్టిన వాయువువల్ల గానీ ఈ ప్రమాదం ఏర్పడినట్లు భావిస్తాయి.

తన అనుమానం రక్షణశాఖ గుమ్మంలో ఆగిపోయింది.

ప్రతిష్టమైన ఆధారం లేకుండా తను లోపలికి వెళ్ళలేదు.

అప్పుడే ఎక్కడ్నించో భయంకరమైన ప్రేలుడు వినబడి ఆలోచనల్లోంచి త్రుళ్ళిపడ్డాడు రాణా.

అంబులెన్స్ సడన్ బ్రేకుతో నిల్చిపోయింది. చివాలున అతను వెనుక తలుపులు తీసుండగా

ఓవర్ బ్రిడ్జి దాటుతూ, ఎక్కడ ట్రాఫిక్ అక్కడ స్థాణువుల్లా నిల్చిపోడం గమనించాడు రాణా.

రాణా వాన్ దిగుతుండగా, వెనకాల్నించి ఎస్కార్టు పోలీస్ కార్ లోంచి, గాభరాగా పరిగెట్టుకుంటూ వచ్చాడు ఇన్‌స్పెక్టర్ రైనా.

"రాణా! లుక్ దేర్!" అన్నాడతను కంగారుగా, చూపుడువ్రేలితో ఆకాశంలో చూపుతూ.

దట్టమైన నల్లటిపొగ, బ్రహ్మాండమైన బంతి ఆకారంలో, సుడులుతిరుగుతున్న దృశ్యం కనబడింది రాణాకి.

క్రిందభాగంలో ఎర్రగా కనబడుతున్న ఆ బ్రహ్మాండమైన పొగ, నాల్కలు చాచి నీలి ఆకాశంలోకి పయనిస్తోంది.

"వాట్ ది హెల్ ఈజ్ ఇట్?"

రాణా కంఠం, కాళ్లు ఆపి ఆశ్చర్యంగా నిలబడి చూస్తున్న జనం మధ్య బిగ్గరగా ప్రతిధ్వనించింది.

"అయామ్ నాట్ ష్యూర్" యిబ్బందిగా పలికాడు రైనా. "ఆ పొగ బహుశా బోరిబందర్ సెంటర్ చుట్టు ప్రక్కల్నించి వెలువడుతూ వుండివుండాలి. మున్సిపల్ కార్పొరేషన్ బిల్డింగ్ ముందుభాగంలో అయ్యుండాలి. అవును.... కార్పొరేషన్ టవర్ ఏదీ....?"

నోరు తెర్చుకుని వుండిపోయాడు రైనా.

దూరాన్నించి యింకా ప్రేలుళ్ళు సన్నగా విన

బడుతున్నాయి.

అగ్నిశిఖలు పిస్తోలు తూటాల్లా ఆకాశంలోకి దూసుకు పోతున్నాయ్.

"సో....ఇక్కడ కూడా ప్రారంభమైందన్నమాట!" గొణుక్కున్నాడు రాణా.

"వ్వాటో? నో....మనకిక్కడ విషమేఘం లేదు!" గాభరాగా అన్నాడు రైనా. "దానికీ, దీనికీ సంబంధం లేదు-ఉండటానిక్కూ వీల్లేదు!"

"ఆ విషయం మనకి నిర్ధారణగా తెలిస్తే బాగుండేది."

జనం గుంపులు గుంపులుగా జేరి, ఉద్రేకంగా మాట్లాడు కుంటున్నారు మధ్యలో నల్లని ఆకారం వైపు చేతులతో చూపిస్తూ....

ఇన్స్పెక్టర్ రైనా, నడుచుకుంటూ ఓ గుంపుమధ్యకు వెళ్ళాడు.

ఒక నిముషం తర్వాత—తిరిగి వచ్చాడు. "నీ ప్రశ్నకు సమాధానం దొరికింది" చెప్పాడు రాణాతో. "అక్కడి జనం నగరంచుట్టూ తిరుగుతున్న ఓ విమానాన్ని చూసా రట! చాల క్రిందకి ఎగురుతుండడంతో ప్రమాదంలో వుందని గ్రహించారట. సడన్‌గా విమానం డైవ్ చేసు కుంటూ క్రిందికి వెళ్ళిందట. అప్పుడే టవర్‌ని గుద్దిందని వాళ్ళు అనుకుంటున్నారు. ఒకతను ఖచ్చితంగా చూసినట్లు చెబుతున్నాడు."

నమ్మలేనట్లుగా తల విదిలించాడు రాణా. "దారుణం! ఇది కూడా ఆ విషమేఘ ప్రభావమే అయ్యుంటుంది—"

"మామూలుగా నీకు చెప్పావనంతే! విషమేఘానికీ ఈ దుర్ఘటనకీ సంబంధం లేకపోవచ్చు."

"చేదునిజాన్ని నమ్మకతప్పదు రైనా! తప్పదు....

ప్రస్తుతం నాసిక్ ప్రాంతంలో కదులుతున్న ఆ పొగ మంచులో నుండి వచ్చివుంటుంది."

అకస్మాత్తుగా రాణా శరీరం చలితో జలదరించింది— అంతటి ఎండలో.

* * *

వైద్య పరిశోధనా విభాగం—బిల్డింగు క్రిందభాగంలోని అండర్ గ్రౌండ్ లో వుందని తెల్సుకొని ఆశ్చర్యపోయాడు రాణా.

బొంబాయిలో—ఆల్ యిండియా మెడికల్ రీసెర్చి శాఖకి ఒక భవంతి ఉన్నట్టే తెలియదు, రాణాకి ఇంతకు పూర్వం.

నీలిరంగు సూటులోవున్న ఓ లావుపాటి వ్యక్తి ఛీఫ్ మెడికల్ ఆఫీసర్ గా తనను తాను పరిచయం చేసుకున్నాడు రాణా, రైనాలతో

"జంటిల్మెన్! మిమ్మల్ని బేస్ మెంట్ క్రింద అంతస్థులోకి తీసుకెళ్ళి మిస్. జులేఖాకి అప్పగించబోతున్నాను. మిస్. జులేఖా ఇక్కడ 'రీసెర్చి' విభాగాన్కి ప్రధాన వైద్యాధికారిణి. ఆమె సెక్షన్ కీ, మా సెక్షన్ కీ సంబంధం లేదు.

కాని కొన్ని ప్రత్యేక కారణాలవల్ల ఆమె విభాగం యిదే బిల్డింగ్ లో కేటాయించబడింది. వారి ప్రత్యేక పరిశోధనలు దేశం నలుమూలలా కొనసాగుతుంటాయ్.

కాని ఒక ప్రాజెక్ట్ లాంటి ప్రత్యేక కార్యక్రమం అమలుపర్చవల్సి వచ్చినప్పుడు ఆమె శాఖలోని వైద్యనిపుణులందరూ ఇక్కడ సమావేశమౌతూ వుంటారు.

"బైదిబై....అఫీషియల్ సీక్రెట్స్ చట్టం గురించి మీకు తెలుసుననుకుంటాను. కాబట్టి యీ వివరాలు మీ

రెక్కడా బైటపెట్టకూడదు" తన మాటలకు వారి ముఖాల్లో రంగులు మారడం గమనించి నవ్వాడు సి.ఎం.ఓ "కంగారుపడకండి. అంత అతిరహస్యం కాదనుకోండి. కాని కొన్ని కారణాలవల్ల ఈ విభాగం గురించి బైటి వాళ్ళకు తెలియడాన్కి ఒప్పుకోలేం."

ముగ్గురూ లిఫ్ట్‌లో ప్రవేశించారు.

మత్తులో, స్పృహకూ కోల్పోయివున్న లూసీ-బిల్డింగ్ వెనకవున్న ఓ ప్రత్యేక ద్వారం గుండా లోనికి తరలించబడింది.

లిఫ్ట్ తలుపులు తెర్చుకోగానే రాణా కళ్ళు జిగేలుమన్నాయ్.

ఎదురుగా—ఉల్లిపొరలాంటి పసుపురంగు చీరమీద తెల్లనికోటు ధరించిన ఓ అపురూప సౌందర్యవతి ప్రత్యక్షమైవుంది.

ఎవరూ పరిచయం చేయడాన్కి ఎదురు చూడకుండా ఆమె విద్యుల్లతలా ముందుకి కదిలి, రాణాతో చేయి కలిపింది. "మిస్టర్ మహారాణా మీ రేననుకుంటాను" నవ్వినపుడు ముత్యాల్లాంటి ఆమె పలువరస తళుక్కున మెరిసింది. "మీ డిపార్టుమెంట్ మీ గురించి పంపిన ఫైలు చదివి వివరాలు తెల్సుకున్నాను. నిజం చెప్పాలంటే ఫైల్లో వున్న మీ ఫోటోగ్రాఫ్ మీకు న్యాయం చేయలేదు. మీరు బైటే బావున్నారు."

ఆమె చొరవకు అప్రతిభుడౌతూ, రాణా బలహీనంగా నవ్వాడు.

ఛీఫ్ మెడికల్ ఆఫీసర్ సేత్నా కలగజేసుకుంటూ అన్నాడు నవ్వుతూ "ఈమే మిస్. జులేఖా! వయసు ముప్పై. పెళ్ళి చేసుకోలేదు. జీవితాన్ని వైద్యానికి అంకితం

చేసింది" అంటూ ప్రక్కకి తిరిగి అన్నాడు "జులేఖా! ఇక వీళ్ళని నీకు వదిలేస్తున్నాను. ఓ.కే?"

ఆమె తలవూపింది.

ఆరోగ్యమంత్రిత్వ శాఖకు చెందిన ఆ వ్యక్తి-చుట్టూ లిఫ్ట్ డోర్ మూసుకుంటూ వుండగా, అన్నదామె.

"ప్లీజ్ ఫాలో మీ జంటిల్మెన్!"

ఇద్దరూ ఆమెను అనుసరించసాగారు.

ఈమె మెడికల్ ఆఫీసరా?

రాణా నవ్వడంకంటే ఏమీ చేయలేకపోయాడు.

జులేఖా సినిమాతారలా వుంది, మిరుమిట్లు గొలిపే అందంతో___

కాని త్వరలో ఆమే నిరూపించుకోవాలి, తన వైద్య విజ్ఞానాన్ని.

జులేఖా నడుస్తూ గడగడా మాట్లాడసాగింది. "సర్ సేత్నా మీకు చెప్పే వుంటారనుకుంటాను, ఈ ప్రత్యేకస్థలాన్కి మిమ్మల్ని ఎందుకు తీసుకురావల్సి వచ్చిందో.... దేశంలో వివిధ ప్రదేశాల నుంచి, మా సభ్యులైన వైద్యనిపుణులుని ఇక్కడికి తీసుకురావడం జరిగింది. మిమ్మల్ని వారి పరీక్షలకోసం, దేశం నలువైపులా తిప్పటం కంటే, యిదే సులభంగా వుంటుందని, యీ ఏర్పాటు చేసాం....

"మీరు ఇంకా విన్నారో లేదో.... ప్రతిపక్షాల ప్రోద్బలంతో ఇంటర్నల్ ఎమర్జన్సీ డిక్లేర్ చేయబడింది. దానిప్రకారం ప్రభుత్వం తరఫున పనిచేస్తున్న వైద్యనిపుణుల ఆదేశాలను ప్రజలు ఖచ్చితంగా పాటించాలి. అందుకే, మేం ఈ విషమేఘం సమస్యకు వెంటనే పరిష్కారం కనుక్కోవాలి.... చాలా చాలా వేగంగా...."

ఇద్దర్నీ ఓ ఆఫీసులోకి నడిపించి కూర్చోమని చెప్పింది జులేఖా. టేబుల్ అంచుకు ఆనుకుంటూ నిలబడిందామె,

"నౌ, ది ఫస్ట్ థింగ్ ఈజ్ .... మీ ఇద్దరూ ఉదయం నుంచీ ఏమైన ఆహారం తీసుకున్నారా?"

. అడ్డంగా ఊగుతున్న తలలు చూసి నవ్విందామె. "రైట్! ఆ ఏర్పాట్లు వెంటనే చేస్తాను. కాని మిస్టర్ మహారాణా! మీరు ఎక్కువగా తినకూడదని చెప్పడానికి చింతిస్తున్నాను. మేము మీ మీద చేయబోయే పరీక్షలు దానికి అంగీకరించవు. అలాగని ఖాళీకడుపుతో ఉంచను లెండి. డాక్టర్ల చేతుల్లో మీరు స్పృహకోల్పోవడం నాకు యిష్టంలేదు. వాడ్డు యు సే?"

రాణా, ఆమె మాటల్లోని వశీకరణశక్తికి విస్తుపోతున్నాడు. ఆమె సన్నిధిలో తన అలసట మెల్లగా మాయమౌతున్నట్లు గ్రహించాడతను.

"మిస్టర్ మహారాణా! మీరు ఆహారం తీసుకుంటూ విషమేఘం గురించి మీకు తెల్సినదీ, చూసినదీ, ఫీలైనదీ, మొత్తం అంతా నాకు వివరంగా చెప్పాలి పూసగుచ్చినట్లు, ఏదీ మర్చిపోకుండా."

"యు.నో? ఒక్కోసారి 'అతిచిన్న' విషయానికే ప్రాధాన్యత లభిస్తుంది, అందుచేత."

టెలిఫోన్ అందుకుని ఒక బటన్ నొక్కి యిద్దరికీ బ్రేక్‌ఫాస్ట్ ఆర్డర్ చేసింది జులేఖా.

రైనావేపు చూసాడు రాణా.

తనకు అక్కడ ఏ మాత్రం ప్రాధాన్యత లేనందుకు, ముఖం చిన్నబుచ్చుకుని, కూర్చుని ఉన్నాడు ఇన్‌స్పెక్టర్ రైనా.

"ఓహ్!.... బైదివే, మీరు నన్ను జులేఖా అని పిల

వొచ్చు, ముందు 'మిస్' కాని 'డాక్టర్' కాని అక్కర్లేదు" వారిద్దరికీ చెప్పింది నవ్వుతూ రిసీవర్ క్రెడిల్ చేస్తూ జులేఖా.

"నా మిస్టర్ మహారాణా! యింతకు ముందు మీకు చెప్పినట్లుగా ఈ రోజు మాకు చాలా బిజీ దే! మీకు, మాకు కావల్సిన సౌకర్యాలు, సదుపాయాలు, అన్నీ ఉన్నాయి ఇక్కడ. దేశంలోని గొప్ప వైద్య మేధావులు ఈ రోజు ఇక్కడకు వచ్చారు. కొంతమంది జస్లోక్ నిపుణులు వున్నారు. ఇండియన్ ఇన్స్టిట్యూట్, ఢిల్లీ నుండి ఇంకా ప్రొఫెసర్లు రావాలి. వారు యిప్పటికే బయలుదేరారు. ఐ కెన్ ప్రామిస్ యూ వన్ థింగ్ ....గత రెండు గంటల్లో కూడా ఒక్క నిముషమైనా మేము వృధా చెయ్యలేదు."

"మీరు స్పష్టంగా నన్ను పరీక్ష చేసి కనుక్కోవాల్సిందేముంది? ఐమీన్ .... నేను పూర్తిగా కోలుకున్నాననుకుంటాను. అవునా?"

"ఫస్ట్ ఆఫ్ ఆల్ -'ఇన్ఫర్మేషన్' రాణా! కాంబేలో మీకు ట్రీట్మెంట్ ఇచ్చిన డాక్టర్లను ఫోన్లో కాంటాక్ట్ చేశాను. అప్పట్లో మీ ఉన్మాద లక్షణాల గురించి వారు యిచ్చిన వివరణ మాకెంతో ఉపయోగకారైంది. కాని ఆ వివరాలు సఫిషియెంట్ గా లేవనే చెప్పాలి. మిమ్మల్ని పరీక్ష చేయడం ద్వారా—మీ మెదడుకు ఎంతవరకు నష్టం వాటిల్లిందో పరిశోధించవచ్చు. నా ఉద్దేశంలో మీరు యిప్పుడు పూర్తి ఆరోగ్యవంతులు. కాని దాని తాలూకు ఛాయలు యింకా కదలాడుతుండవచ్చు. ఉదాహరణకు ఒక దెబ్బవల్ల శరీరం కమిలినట్లు—ఒక గాటు—మచ్చను మిగిల్చినట్టు...."

"డు యు థింక్ ఐ నీడ్ సర్జరీ?"

జులేఖా పకపకా నవ్వింది. "లేదు రాణా! మీ కేసులో దాని అవసరం లేదు. సర్జరీ చెయ్యాల్సివస్తే మాకు మృతదేహాలున్నాయిగా?"

"వాట్ ఎబౌట్ లూసీ?"

"ఆమెను తప్పక క్యూర్ చేయడానికి ప్రయత్నిస్తాం."

బ్రేక్‌ఫాస్ట్—ట్రాలీమీద అమర్చబడి, చక్రాలు దొర్లుతుండగా లోనికి వచ్చింది.

జులేఖా, హియరింగ్ సెషన్‌కి సిద్ధమౌతూ వెనక్కి తిరిగి, టేప్ రికార్డర్ స్విచ్ ఆన్ చేసింది.

"నౌ స్టార్ట్ టాకింగ్ రాణా!" ఆదేశించింది జులేఖా. "ఆ మిస్టీరియస్ విషమేఘం గురించి మీకు తెల్సున్నదంతా చెప్పండి. ప్రశాంతంగా, మొదటినుంచీ ప్రారంభించండి. ఏ చిన్నవిషయం కూడా మర్చిపోకుండా చెప్పడానికి ప్రయత్నించండి."

ర ర ర

ఆ రోజులో మిగతా భాగం ఎలా గడిచిందో లీలామాత్రంగా మాత్రమే జ్ఞాపకం వుంది రాణాకి....

రకరకాల పరీక్షలు, ప్రశ్నలు, పరిశోధనలతో దాడి చేయబడ్డాడు రాణా....

ఎలక్ట్రోకార్డియోగ్రాఫ్‌తో అతని గుండె టెస్టు చేయబడింది....

అతని శరీరమంతా ఎక్స్-రే చేయబడింది....

మెదడులో ఏ భాగమైనా తన సహజ సరళిని కోల్పోయిందేమో తెల్సుకోవడంకోసం, గుండెనుండి, మెదడుకు బయలుదేరే ఓ రక్తనాళాన్ని ఒక విధమైన

'రేడియో ఒపేక్' ద్రవం ఇంజక్ట్ చేయబడింది....

కంతిలాంటిదేమైనా, ఫార్మ్ అయివుంటే పసికట్టడాన్కి, అతని తలచుట్టూ ఎలక్ట్రోడ్స్ అమర్చబడ్డాయ్.

సూదిద్వారా, అతని శరీరంలో సెరబ్రో స్పైనల్ ద్రవాన్ని బైటకుతీసి, తిరిగి అతని వెన్నెముక క్రింద భాగంలో ఉండే 'సబారాక్నోయిడ్ స్పేస్'లో ఇంజక్ట్ చేసారు.

ఇవికాక, ఇంకా అనేక రకాల పరిశోధనలు లూసీ, రాణాలమీద జరుపబడ్డాయ్.

మధ్యాహ్నానికల్లా—ప్రయోగాలకు చిత్రహింస అయిన రాణా శరీరం గాఢమైన నిద్రలోకి ఒరిగిపోయింది....

కొద్దిగంటలు గడిచాక, రాణా నిద్రనుంచి మేల్కొని కళ్ళు తెరిచేసరికి, ఎదురుగా వాలుకుర్చీలో జారబడి కునికిపాట్లు పడ్తున్న ఇనస్పెక్టర్ రైనా కనబడ్డాడు.

రాణా లేచి కూర్చుంటుండగా, జోగుతున్న రైనా ఉలిక్కిపడి, కళ్ళుతెరిచి బెడ్ వైపు చూసాడు.

నవ్వుతూ ముఖం రుద్దుకున్నాడు రైనా, "ఈ లోకంతో సంబంధం లేనట్లు నిద్రపోయావ్!" అన్నాడు రైనా.

"నువ్వు నాకంటే ఏమీ తీసిపోలేదు."

"య్యా....కాని నాకు నిద్ర ఎప్పుడూ మత్తుగా పట్టదు" విచారంగా చూసాడు ఇన్‌స్పెక్టర్. "లుక్ బ్రదర్! మనం యిక రాజీపడ్డం మంచిది. నీ పట్ల నేను చాలా రఫ్‌గా ప్రవర్తించాను. కాని పరిసితి అలాంటిది. అసహజమైనదదీ....నమ్మశక్యం కానిదీ....ఏమంటావ్?"

"అవును."

"వెల్. అయామ్ సారీ."

"ఓ.కే. ఆ విషయం మర్చిపోదాం. నువ్వింకా ఇక్కడే వున్నందుకు నాకాశ్చర్యంగా వుంది."

"స్పెషల్ డ్యూటీ బ్రదర్. నేను బాడీగార్డుని. నువ్విప్పుడు దేశంలో ప్రముఖ వ్యక్తివి. మరో ప్రముఖ యువతి బైటవుంది."

"నన్ను ఎవరైనా హత్య చేస్తారని వాళ్ళు భావిస్తున్నారా? లేక నేను 'పారిపోతానని' అనుకుంటున్నారా?"

రాణా కంఠంలో అనుమానం, కోపం ధ్వనించాయ్. ఇన్స్పెక్టర్ రాణా బరువుగా నిట్టూర్పు విడిచాడు.

"ఫ్రాంక్లీ రాణా! వారి జాగ్రత్తలు వాళ్ళు తీసుకుంటున్నారు. పొగమంచు ప్రభావం, యింకా బయటి ప్రజలమీద వున్నదన్న విషయం మర్చిపోకు. తర్వాత— నువ్వు దాని ప్రభావాన్నుంచి పూర్తిగా బయటపడ్డావని ఇంకా రూఢిగా మాకు తెలియదు."

"ఆల్ రైట్" వెనక్కు తగ్గాడు రాణా. "నేను నిద్రలో వుండగా బయట ఏం జరుగుతూవుందో చెప్పు."

"చాలా జరుగుతూంది. రెండుగంటల క్రితం యిక్కడి డాక్టర్లు, రీసెర్చి మనుషులూ చర్చించుకున్నారు. దేని గురించో నాకు స్పష్టంగా తెలియలేదుగానీ, షేరా మైదాన్ నుంచి వచ్చిన ఆ మైక్రోబయోలాజికల్ రీసెర్చి వ్యక్తులకీ, ఇక్కడి డాక్టర్లకీ తీవ్రంగా వాదోపవాదాలు జరిగాయ్. చాలా ప్రశ్నలకి సమాధానాలు చెప్పడాన్కి వారు నిరాకరించారు. డిఫెన్స్ మినిస్ట్రీ అనుమతి లేకుండా వాళ్ళు నోరు విప్పరట."

"కాలువన్నీ నదిలో కల్సినట్లు, అందరి అనుమానాలు ఒకదారిన పడ్డాయన్నమాట" వ్యాఖ్యానించాడు రాణా.

"అవును. కోపంలోవున్న డాక్టర్లను వదిలిపెట్టి— వాళ్ళు రక్షణశాఖ సహాయమంత్రిని సంప్రదించడానికి బైటికి వెళ్ళిపోయారు. వైద్యనిపుణులు తమ పని తాము చూసుకుంటున్నారు. కాని వారు అయిష్టంగా, అసంతృప్తిగా ఉన్నారని ఖచ్చితంగా చెప్పగలను."

"హౌ ఈజ్ లూసీ?"

"తెలీదు. మెడికల్ ఆఫీసర్ నువ్వు లేవగానే కబురు పంపమంది" అంటూ పైకిలేచి గుమ్మం దగ్గిరకి నడిచి, తలుపుబైట, యూనిఫాంలో నిలబడివున్న కానిస్టేబుల్‌కి సూచనలిచ్చాడు ఏవో రైనా.

"విషమేఘం సంగతేమిటి?" అడిగాడు రాణా, వెనక్కి తిరిగి కుర్చీవైపుగా నడుస్తున్న ఇన్‌స్పెక్టర్ని చూస్తూ.

"వాళ్ళకి కనబడిందది. నీకు తెల్సు ఆ విషయం. అదృష్టవశాత్తు గాలివేగం తగ్గడంవల్ల నెమ్మదిగా కదులోంది అది. 'ఇప్పుడు' ఆ విషమేఘం చాలా ఆశ్చర్యం గొలిపే దృశ్యం! ఒక మైలు పొడవు, ఒక మైలు వెడల్పు."

"మైగాడ్! అది పెరిగి పెద్దదైందన్న మాట!" అన్నాడు రాణా ఆ ఆలోచనే, ఆ భయంకర సత్యం— రాణా గుండెల్లో సంచలనం రేకెత్తిస్తోంది.

ఎటో చూస్తూ అన్నాడు బెంగగా. "నేను మొదట్లో చూసినపుడు దాని పరిమాణం చాలా కొద్దిగా మాత్రమే వుంది."

(సశేషం)